
## కాంగ్రెస్‌కు ఓటేస్తే..
# కష్టాలు గ్యారెంటీ

- నరేందర్‌రెడ్డి గెలిస్తే.. సముచిత స్థానం కల్పిస్తాం..
- రైతుబంధు ఖతం కావాలా ? కాంగ్రెస్ ఖతం కావాలా ?
- కాంగ్రెస్‌కు ఓటేస్తే 3 గంటల కరెంటుతో ముప్పతిప్పలే..
- రేవంత్ కొడంగల్‌కా నై.. కామారెడ్డికా నై..
- లీడర్లను కొనొచ్చు.. ఇక్కడి బిడ్డల ఆత్మగౌరవాన్ని కొనలేవు..
- మద్దూర్ రోడ్‌షోలో మంత్రి హరీశ్‌రావు


మద్దూర్ మండలకేంద్రంలో నిర్వహించిన రోడ్‌షోలో ప్రసంగిస్తున్న మంత్రి హరీశ్‌రావు


కొడంగల్/మద్దూర్, నవంబర్ 28 : సంక్షేమ పథకాలను నిరంతరాయంగా కొనసాగాలంటే కేసీఆరే సీఎం కావాలని, కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగమైతమని మంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూర్‌లో నిర్వహించిన రోడ్ షోలో మంత్రి పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ సీఎం అయ్యాకే సాధించుకున్న తెలంగాణలో సంక్షేమం, అభివృద్ధి జాతర కొనసాగుతుందన్నారు. కోట్లాది నిధులతో తెలంగాణ అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగమేనని, 50 ఏండ్ల పాలనే అందుకు నిదర్శనమన్నారు. పదేండ్లు కొడంగల్ ఎమ్మెల్యేగా రేవంత్‌రెడ్డి ఉండి గుడి కట్టలేదు.. బడి కట్టలేదన్నారు. కాంగ్రెస్‌కు అభ్యర్థులే లేరని, రేవంత్ ఏవిధంగా సీఎం అవుతాడని ప్రశ్నించారు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతుబంధు ఖతం, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు ఖతం చేశారన్నారు. రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి 3గంటల కరెంటు సరిపోతుందన్నాడని, నిజంగా సరిపోతుందా అని ప్రశ్నించారు. ఎవుసం తెలువని రేవంత్ కాబట్టే మూర్ఖంగా మాట్లాడుతున్నాడన్నారు. కర్ణాటకలో గతంలో 9 గంటల కరెంట్ ఉండగా ప్రస్తుతం 3, 4గంటలు మాత్రమే సరఫరా అవుతున్నదన్నారు. దాంతో కన్నడ ప్రజలు కాంగ్రెస్‌ను ఎందుకు గెలిపించుకున్నామా అని బాధపడుతున్నట్లు వివరించారు. కేసీఆర్ వచ్చాకే తండాలు జీపీలుగా మారాయని స్పష్టం చేశారు. 24గంటల కరెంటు, ఇంటింటికీ కృష్ణాజలాలు, కళ్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, రైతుబంధు, రైతుబీమాతో తెలంగాణ అన్నపూర్ణ రాష్ట్రంగా అవతరించిందన్నారు. కాంగ్రెస్ నాయకులకు క్లారిటీ లేదని, అధికారం కోసం నోటికొచ్చిన వాగ్దానాలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే పదేండ్లు వెనక్కి వెళ్తామన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల కాల్వ పనులతో కొడంగల్‌లో లక్షా49వేల ఎకరాలకు సాగునీరందే సమయం దగ్గర్లోనే ఉందన్నారు. కాంగ్రెస్‌ను తప్పించి అభివృద్ధిని సాధించుకుందామని పిలుపునిచ్చారు. పట్నం నరేందర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే మద్దూర్‌ను మున్సిపాలిటీగా మార్చి రోడ్డు వెడల్పుతోపాటు స్ట్రీట్ లైట్లతో సుందరీకరిస్తామని హామీ ఇచ్చారు. స్థానికంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేలా దౌల్తాబాద్ ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు, నియోజకవర్గంలో డివిజన్ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే సీఎం కేసీఆర్ కాళ్లు పట్టుకునైనా సరే కొడంగల్‌కు ప్రమోషన్ ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. కేసీఆర్ అంటే నమ్మకం.. విశ్వాసంగా పేర్కొంటూ కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, కాంగ్రెస్‌కు ఓటేసి అభివృద్ధిని అడ్డుకోవద్దని సూచించారు.

**హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ చరిత్ర సృష్టిస్తారు**

హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ చరిత్ర సృష్టిస్తారని మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే పట్నం ఐదేండ్లుగా ప్రజల మధ్య ఉంటూ కొడంగల్ అభివృద్ధికి పాటుపడినట్లు తెలిపారు. అందువల్లే ఏ గ్రామానికి వెళ్లినా ఎమ్మెల్యేకు ప్రజలు బ్రహ్మారథం పడుతున్నారన్నారు.

**రూ.2వేలకోట్ల నిధులు మంజూరు**

గడిచిన ఐదేండ్లలో కొడంగల్ అభివృద్ధికి రూ.2వేల కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తెలిపారు. అభ్యర్థి అందుబాటులో లేక నేడు కాంగ్రెస్ నాయకులు ఫొటోను చూపి ఓట్లు అడుగుతున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్‌కు ప్రజల్లోకి వెళ్లే దమ్ము ధైర్యం లేక నాయకులతో ప్రచారం చేయిస్తున్నట్లు తెలిపారు. గతంలో గెలిచి హైదరాబాద్‌కు పరిమితమై భూ కబ్జాలు, బ్లాక్‌మెయిల్ దందాలతో కోట్లు గడించి, నేటి ఎన్నికల్లో ప్రజా నాయకులను కొనుగోలు చేసి గెలవాలనే కుట్రలు పన్నుతున్నట్లు ఆరోపించారు. రేవంత్‌రెడ్డిపై పోటీ చేసేందుకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ అవసరం లేదని, దమ్ముంటే తనపై గెలవాలని సవాల్ విసిరారు. డిసెంబర్ 30తో కాంగ్రెస్ ఎన్నికల జాతర ముగుస్తుందని, రేవంత్ హైదరాబాద్‌కు పరిమితం కావడం ఖాయమని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ టికెట్లను రూ.10కోట్ల నుంచి రూ.50కోట్ల వరకు అమ్ముకోవడం వల్ల కాంగ్రెస్ నాయకులు రేవంత్‌రెడ్డికి రేటెంతరెడ్డి అని పేరు పెట్టారన్నారు. మరోసారి ఆశీర్వదిస్తే.. ఐదేండ్లు ప్రజలకు అందుబాటులో ఉండి, సేవకుడిలా పని చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ డైరెక్టర్ సలీం, మాజీ జెడ్పీటీసీ బాల్‌సింగ్, కోస్గి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వీరారెడ్డి, పీఏసీసీఎస్ చైర్మన్ జగదీశ్వర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సీ.వెంకటయ్య, సర్పంచ్ అరుణతోపాటు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


మిద్దె పైనుంచి మంత్రి ప్రసంగాన్ని ఆసక్తిగా వింటున్న ప్రజలు

# పరాయి పెత్తనాన్ని సహించం

- గద్వాల బిడ్డలకు పౌరుషమెక్కువ
- రోడ్ షోలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- మా వెంట సీడ్, నయీం మాఫియా లేదు
- మా బలం, బలగం ప్రజలే
- ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి
- జనసంద్రమైన గద్వాల పట్టణం

మెల్లచెరువులో ఎమ్మెల్యే బండ్ల ప్రసంగాన్ని వింటున్న ప్రజలు


గద్వాల, నవంబర్ 28 : గద్వాల బిడ్డలు పౌరుషం గలవారని, పరాయి వ్యక్తులొచ్చి ఇక్కడ పెత్తనం చేస్తామంటే ఇక్కడి వారు సహించరని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ''గత ఎన్నికల్లో నా విజయానికి మీరు కారణమయ్యారు. 2018 ఎన్నికల్లో మీరు ఆశీర్వదించడం వల్లే ఎమ్మెల్యేనయ్యా. ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నా. మా బలం, బలగం మీరే'' అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రచారం చివరి రోజు ఎమ్మెల్యే గద్వాలలో రోడ్ షో నిర్వహించారు. కిష్టారెడ్డి బంగ్లా నుంచి ప్రారంభమైన రోడ్ షో గాంధీచౌక్ మీదుగా పాతబస్టాండ్‌కు చేరుకోగా పట్టణమంతా జనసంద్రమైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ సారథ్యంలో మరోసారి అవకాశమిస్తే గద్వాలను మరింత అభివృద్ధి చేయడానికి మీ ముందుకొచ్చానన్నారు. రాష్ట్రాన్ని 13మంది ముఖ్యమంత్రులు 50 ఏండ్లు పాలించారు. అందులో కాంగ్రెస్ పార్టీయే ఎక్కువ కాలం పాలించింది. వారి పాలనలో ఒరిగిందేమీ లేదు. ఈ రోజు కాంగ్రెస్ నాయకులు మీ ముందుకొచ్చి అది చేస్తాం.. ఇది చేస్తామని చెబుతున్నారు. 50 ఏండ్ల పాలనలో చేయని వారు ఇప్పుడు ఏం చేస్తారు'' అని ప్రశ్నించారు. ఇక్కడి కాంగ్రెస్ అభ్యర్థి కళ్లు నెత్తికెక్కి మాట్లాడుతుందని, తనను తొక్కడానికి ఆమె చేతనైతదా అని ప్రశ్నించారు. రెచ్చగొట్టే మాటలు మాట్లాడేవారిని ప్రజలు గమనించాలని కోరారు. అందరి బాధలు, కష్టాల్లో అండగా ఉంటాను.. నన్ను ఆదరించండని కోరారు. అలంపూర్ నాయకుల పెత్తనం ఇక్కడ చెల్లదన్నారు. గురువారం జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అలంపూర్ నాయకులు హఠావో.. గద్వాలకు బచావో అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెసోళ్ల వెంట ఉన్నట్లు తమ వెంట సీడ్, నయీం మాఫియా లేదని, తమకు ప్రజాబలం, పేదల అండ మాత్రమే ఉందని ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి అన్నారు. మన సత్తా ఏమిటో నిరూపించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని, కృష్ణమోహన్‌రెడ్డికి ఓటేసి గద్వాల అభివృద్ధికి పాటుపడదామని పిలుపునిచ్చారు. ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఏం అభివృద్ధి చేశారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. గద్వాల ప్రశాంతంగా ఉండాలంటే కృష్ణమోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేశవ్, వైస్‌చైర్మన్ బాబర్, రాష్ట్ర వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప, జెడ్పీటీసీ పద్మావెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


మెల్లచెరువులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల

**మరింత అభివృద్ధి చేసుకుందాం..**

గద్వాల రూరల్, నవంబర్ 28 : సంక్షేమం ఇలాగే సాగాలంటే మోరోసారి బీఆర్‌ఎస్ పార్టీని ఆదరించాలని ఎమ్మెల్యే బండ్ల అన్నారు. మంగళవారం మెల్లచెరువు, గుంటిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి సంక్షేమాన్ని వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు బీఆర్‌ఎస్ నాయకులు, మహిళలు పూలు చల్లుతూ, పుష్పగుచ్ఛాలు అందజేస్తూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనమ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో అన్ని వర్గాలకు సమన్యాయం జరిగిందన్నారు. కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో మరోసారి కేసీఆర్‌ను, తనను కారు గుర్తుకు ఓటేసి, వేయించి భారీ మోజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్స్యూమర్ ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప, ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, వైస్‌ఎంపీపీ దామోదర్, సర్పంచులు దేవకర్ణమ్మ, మన్యస్వామి, కళ్యాణి, నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ను గెలిపిస్తే మళ్లీ కష్టాలే

- ప్రజలను మభ్యపెట్టెందుకే ఆరు గ్యారెంటీలు
- అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తా
- నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తా
- అలంపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు

మానవపాడు, నవంబర్ 28 : ఆర్డీఎస్ ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించి అలంపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని బీఆర్‌ఎస్ ఎమ్మెల్మే అభ్యర్థి విజయుడు అన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మంగళవారం మద్దూరు, చండూరు గ్రామాల్లో విజయుడు ప్రచారం నిర్వహించగా ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ తనను ఆశీర్వదించాలని కోరారు. గత ప్రభుత్వాలు అలంపూర్ అభివృద్ధిని విస్మరించారన్నారు. తెలంగాణలో రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, అలంపూర్‌లో కారు స్పీడుకు ప్రతిపక్షాలు గల్లంతవుతాయన్నారు. కాంగ్రెసోల్లు ప్రజలను మభ్యపెట్టేందుకే ఆరు గ్యారెంటీల హామీలిస్తున్నారని వివరించారు. గతంలో కనీసం తాగునీటిని అందించలేని వాళ్లు ఆరు గ్యారెంటీలు ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మితే మరోసారి ఆగం కాల్సిందేనన్నారు. అలంపూర్‌ను ఎడారిగా మార్చిన హస్తం పార్టీని నమ్మితే అరిగోస తప్పదని హెచ్చరించారు. పేదింటి కష్టాలు తనకు తెలుసని, కారు గుర్తుకు ఓటేసి ఆశీర్వదిస్తే అన్ని సమస్యలు తీర్చుతామన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో మల్లమ్మకుంట, జులెకల్, వల్లూరు రిజర్వాయర్లు నిర్మిస్తామన్నారు. చిన్నోనిపల్లె రిజర్వాయర్ నుంచి సమాంతర కాల్వ, నెట్టెంపాడ్ 99, 100 ప్యాకేజీలను పూర్తిచేసి సాగునీటిని అందిస్తామన్నారు. ముచ్చటగా మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారన్నారు. ప్రచారంలో ఎంపీపీ అశోక్‌రెడ్డి, చండూరు సర్పంచ్ నర్సింహులు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


మానవపాడు: పొలంలోని కూలీలను ఓటు అభ్యర్థిస్తున్న విజయుడు